www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్,
10 జూన్ 2023
సంపుటి: 1, సంచిక: 230

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## అధికారంలోకి వచ్చాక ధరణిని బరాబర్ రద్దు చేస్తాం

### గడీల పాలన పునరుద్ధరించడానికే కేసీఆర్ ధరణి

### దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజన్ పని

### 2004-2014, 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం

### టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సవాల్

**హైదరాబాద్, - విశాల భారతి:** "రాష్ట్రంలో కేసీఆర్ పై చేసే పోరాటంలో గెలవాలంటే యువత ముందుండాలి. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించాలి. డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మ దినోత్సవం సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలి" అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ మేనిఫెస్టోను తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17న విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడలోని కత్రియా హోటల్లో జరిగిన యూత్ కాంగ్రెస్ జాతీయ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం అధికారికంగా నిర్వహిస్తుంది. " తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. అత్యంత కీలకమైన ఐదు అంశాలతో ప్రజలవద్దకు వెళ్తాము. అగ్రనాయకులు అందుబాటులో ఉండే అవకాశాన్ని బట్టి బహిరంగ సభలు ఉంటాయి. కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది." అని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ క్రియాశీల పాత్రపై సమావేశంలో చర్చించినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. " 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి. దీనికి అవసరమైన కార్యాచరణపై యూత్ కాంగ్రెస్‌కు దిశా నిర్దేశం చేశాం. క్షేత్ర స్థాయిలో కీలకంగా పని చేసిన వారు.. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నాయకులవుతారని చెప్పాం. మోదీ, కేసీఆర్‌లను గద్దె దించాలంటే యూత్ కాంగ్రెస్ క్రియాశీలకంగా పని చేయాలి." అని రేవంత్ అన్నారు. క్షేత్ర స్థాయిలో కొట్లాడేవారు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నాయకులవుతారని వ్యాఖ్యానించారు. కష్టపడితే నాయకులు అవుతారు. దేశ భవిష్యత్తును మార్చుతారు. మోదీ, కేసీఆర్ లను గద్దె దించాలంటే యూత్ కాంగ్రెస్ క్రియాశీకలకంగా పనిచేయాలి. రాజకీయ భవిష్యత్‌కు యూత్ కాంగ్రెస్ ఒక మంచి వేదికన్నారు. నాయకుడుగా మారడానికి యూత్ కాంగ్రెస్ ఒక వేదిక అని రేవంత్ తెలిపారు. ఇందుకు ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే మనకు ఉదాహరణ అని వివరించారు. 1200 మంది విద్యార్థి, యువత ప్రాణత్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. డబుల్ ఇంజన్ అంటే మిగతా 2లో





## పదేళ్ల పసికూన పక్క రాష్ట్రాలతో పోటీ

### అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న తెలంగాణ

### దేశంలో బొగ్గుకు కొరత లేనే లేదు

### సింగరేణిని ఒక ఉద్యోగ వనరుగా మార్చబోతున్నాం..

### వచ్చే దసరాకు సింగరేణి కార్మికులకు రూ. 700 కోట్ల బోనస్

### వచ్చే నెల నుంచి వికలాంగులకు రూ. 4,116 పెన్షన్

### మంచిర్యాల జిల్లా ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్

**మంచిర్యాల,- విశాల భారతి:** పసికూన అయిన పది సంవత్సరాల తెలంగాణ.. మిగతా రాష్ట్రాలతో పోటీ పడుతోంది అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న తెలంగాణ.. కేంద్రం నుంచి అనేక అవార్డులను అందుకుందని కేసీఆర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రారంభించుకున్న అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మనందరం చేసిన పోరాటంతో తెలంగాణ సాధించుకున్నాం. పరిపాలన సంస్కరణల కోసం నూతన కలెక్టరేట్‌లను నిర్మించుకున్నాం. సంస్కరణ అనేది నిరంతర ప్రక్రియ. మంచిర్యాల జిల్లా డిమాండ్ ఎప్పట్నుంచో ఉంది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది కాబట్టే మంచిర్యాలను జిల్లాగా ఏర్పాటు చేసుకున్నాం. ప్రజలకు మంచి జరగాలనే కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం.ఆసిఫాబాద్ కలెక్టరేట్‌ను కూడా త్వరలోనే ప్రారంభించుకోబోతున్నాం. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ టాప్‌లో ఉందన్నారు. ప్రజలకు వారధిగా ఉద్యోగులు పని చేయడంతో, మంచి ఫలితాలను సాధించాం. తెలంగాణ ఎన్నో విషయాల్లో నంబర్ వన్‌గా ఉంది. అనేక రికార్డులను నెలకొల్పాం. కరోనా, నోట్ల రద్దు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. మిగతా 2లో



## కాంగ్రెస్ పార్టీ యాడుంది?

### కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా దేశంలో ఎక్కడా లేదు

### బీజేపీ గ్రాఫ్ ను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఓ సెక్షన్ మీడియా కుట్ర

### బీఆర్ఎస్ బాధితుల సంఘం సమావేశం పెడితే స్టేడియం కూడా సరిపోదేమో..?

### ఉమ్మడి ఖమ్మం ప్రజలకు సీఎం ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదు

### ఖమ్మం ప్రిపరేటరీ మీటింగ్ లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్

**ఖమ్మం -, విశాల భారతి:** "తెలంగాణలో అసలు కాంగ్రెస్ పార్టీ యాడుంది? కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా దేశంలో ఎక్కడా ఆ పార్టీ లేదు.. జాకీ పెట్టి లేపినా కాంగ్రెస్ పార్టీ లేవదు.. కమ్యూనిస్టుల పనైపోయింది. మిగతా 2లో

**ఖమ్మం ప్రజల భరోసాకు 15న సభ** 02



## అయ్యగారే హంతకుడు

### అప్సర కేసులో పోలీసుల ప్రైమరీ రిపోర్ట్ ○ అప్సరతో అఫైర్ పెట్టుకున్న పూజారి

### ఆమె మరొకరితో చనువుగా ఉండటంతోనే హత్య?

**విశాలభారతి, హైదరాబాద్:** హైదరాబాద్ నగర పరిధి లోని శంషాబాద్ పరిధి లో నర్కుడ వద్ద జరిగిన మహిళ దారుణ హత్య కేసు ను పోలీసులు ఛేధించారు. ఈ కేసు లో విస్తుపోయే నిజాల ను వెలికి తీశారు. పెళ్లి చేసుకోవాల ని వేధించడం తోనే పూజారి సాయికృష్ణ.. అప్సర ను దారుణం గా అంతమొందించాడని పోలీసులు తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయాని కి సమీపం లో ఉన్న గుడి లో సాయికృష్ణ పూజారి గా పనిచేస్తున్నాడు. ఆ దగ్గర్లో నే శ్రీ వెంకటేశ్వర కాలనీ లో అతడు నివాసం ఉంటున్నాడు. గుడి పక్కనే ఉన్న మిగతా 2లో

## మానుకోట టికెట్ దక్కేదెవరికో?



### బరిలో మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్

### తీవ్రమైన ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపీ కవిత మధ్య వర్గపోరు

### క్లీన్ ఇమేజ్ ఉన్నవారికే టికెట్ అంటూ గులాబీ బాస్ సంకేతాలు

### మంత్రి సత్యవతి రాథోడ్ కే టికెట్ దక్కుతుందని జోరుగా ప్రచారం

**తెలంగాణ బ్యూరో-, విశాల భారతి:** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో నేతల్లో హడావుడి మొదలైంది. అన్ని పార్టీల అధిష్టానాలు తమ అభ్యర్థుల బలబలాలపై విశ్లేషణ చేస్తున్నాయి. టికెట్ ఎవరికిస్తే బాగుంటుందనే అంశంపై ఒక ప్రాథమిక అంచనాకు వస్తున్నాయి. ఈ తరుణంలో మానుకోట ఏ పార్టీకి అనుకూలంగా మారుతుందనేదిచర్చనీయాంశమైంది. గిరిజన జిల్లాగా పేరుగాంచిన మానుకోటపై అధికార పార్టీకి చెందిన ముగ్గురు నేతల కన్నుపడింది. ఒకే పార్టీకి చెందిన ముగ్గురు నేతలు ఆ సెగ్మెంట్ నుంచే పోటీ చేయాలని చూస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్సీ కోటాలో మంత్రిగా అయిన సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేగా కొనసాగుతున్న శంకర్ నాయక్, ఎంపీగా ఉన్న మాలోత్ కవిత చూపు మహబూబాబాద్ పై పడినట్లు తెలుస్తోంది. అయితే ఈ ముగ్గురిలో టికెట్ ఎవరికి దక్కుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగాఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్ వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత స్థితికి వైరం పెరిగింది. దీంతో సౌమ్యురాలిగా ముద్ర పడిన మంత్రి సత్యవతి రాథోడ్ కే టికెట్ దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీకి పట్టున్న గిరిజన జిల్లాగా మహబూబాబాద్ కు పేరుంది. మిగతా 2లో

# పదేళ్ల పసికూన పక్క రాష్ట్రాలతో పోటీ

మొదటి పేజీ తరువాయి

కష్టకాలంలోనూ తెలంగాణ అభివృద్ధిలో ముందుంది. కులమతాలకు అతీతంగా అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేస్తున్న అధికారులకు అభినందనలు. కులవృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని, రెండో విడుత గొర్రెల పంపిణీ పథకాన్ని మంచిర్యాల నుంచే ప్రారంభించుకోబోతున్నాం. గొర్రెల పెంపకంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. మానవీయ కోణంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఆరోగ్య శాఖ బ్రహ్మాండమైన పురోగతి సాధించింది. మాతాశిశు మరణాలు తగ్గాయి. కంటి వెలుగు లాంటి పథకం దేశంలో ఎక్కడా లేదు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ఢిల్లీ, పంజాబ్‌లో కూడా ఆ ముఖ్యమంత్రులు కూడా అమలు చేశారని సీఎం కేసీఆర్ తెలిపారు.

మంచిర్యాల జిల్లా ప్రగతి నివేదన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. వచ్చే దసరా బోనస్‌ను ప్రకటించారు. వచ్చే దసరాకు సింగరేణి కార్మికులకు రూ. 700 కోట్ల బోనస్ ఇస్తామని ప్రకటించారు కేసీఆర్. సంక్షేమంలో బాగున్నాం. వ్యవసాయంలో బాగున్నాం అని కేసీఆర్ తెలిపారు. సింగరేణి సోదరులు కూడా చాలా మంది ఈ సభలో ఉంటారు. సింగరేణి 134 ఏండ్ల చరిత్ర ఉంది. వాస్తవానికి అది మనకు సొంత ఆస్తి. నిజాం కాలంలో ప్రారంభమైంది. వేలాది మందికి అన్నం పెట్టింది. కాంగ్రెస్ పార్టీ హయాంలో సింగరేణిని సర్వనాశనం చేసింది. కేంద్రం నుంచి అప్పులు తీసుకొచ్చింది. అప్పు తిరిగి చెల్లించక, మన సొంతదైన కంపెనీని.. కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా కింద అమ్మేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ విధంగా సింగరేణిని పూర్తిగా నాశనం చేసింది అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

**తెలంగాణ వచ్చాక సింగరేణి నడక మారింది..**

2014 కంటే ముందు కార్మికులకు ఇచ్చే బోనస్ 18 శాతం మాత్రమే అని కేసీఆర్ గుర్తు చేశారు. అంటే కేవలం రూ. 50 నుంచి 60 కోట్లు మాత్రమే కార్మికులకు పంచేది. తెలంగాణ వచ్చాక సింగరేణి నడక మారింది. 2014లో సింగరేణి టర్నోవర్ రూ. 11 వేల కోట్లు మాత్రమే. ఇవాళ అదే సింగరేణి టర్నోవర్‌ను రూ. 33 వేల కోట్లకు పెంచుకున్నాం. అదే విధంగా సింగరేణి లాభాలు కేవలం రూ. 300 నుంచి రూ. 400 కోట్లు మాత్రమే ఉండే. ఇవాళ సింగరేణిలో ఈ ఏడాది వచ్చిన లాభాలు రూ. 2,184 కోట్లు. వచ్చే దసరాకు సింగరేణి కార్మికులకు పంచబోయే బోనస్ రూ. 700 కోట్లు. సింగరేణిలో నూతన నియామకాలు చేసుకుంటున్నాం. 10 సంవత్సరాల కాంగ్రెస్ సామ్రాజంలో 6453 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. తెలంగాణ వచ్చిన తర్వాత డిపెండెంట్ ఉద్యోగాల హక్కును పునుదర్ధరించి 19,463 ఉద్యోగాలను కల్పించాం. 15,256 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాం అని కేసీఆర్ గుర్తు చేశారు. సింగరేణిలో ప్రమాదం జరిగి కార్మికులు చనిపోతే గత ప్రభుత్వాలు రూ. లక్ష ఇచ్చి చేతులు దులుపుకునేది అని కేసీఆర్ పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 10 లక్షలు ఇస్తుంది అని తెలిపారు. వడ్డీ లేకుండా రూ. 10 లక్షల రుణం ఇంటి కోసం ఇస్తున్నాం అని కేసీఆర్ తెలిపారు. రాష్ట్రంలోని వికలాంగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. తెలంగాణలోని వికలాంగులకు ఆసరా పెన్షన్లు పెంచుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. పెంచిన పెన్షన్లు వచ్చే నెల నుంచి అమల్లోకి వస్తాయని కేసీఆర్ పేర్కొన్నారు. మొత్తం తెలంగాణ సమాజం బాగుండాలి అని కేసీఆర్ పేర్కొన్నారు. ముసలమ్మలు, ముసలి తాతలు ఆసరా పెన్షన్లతో బ్రహ్మాండంగా ఉన్నారు. వికలాంగులకు రూ. 3,116 పెన్షన్ ఇస్తున్నాం. ఇవాళ మంచిదినం. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో వికలాంగుల పెన్షన్ కూడా పెంచబోతున్నాం. మరో వెయ్యి రూపాయాలు పెంచుతున్నాం. మంచిర్యాల గడ్డ నుంచి తెలంగాణ ఈశాన్య ప్రాంతం నుంచి ప్రకటించాలని నేను సస్పెన్షన్‌లో పెట్టాను. వచ్చే నెల నుంచి రూ. 4,116 పెన్షన్ అందుతుంది. అందరి సంక్షేమాన్ని, మంచిని చూసుకుంటున్నాం అని కేసీఆర్ తెలిపారు. సింగరేణిని కాంగ్రెస్ సగం ముంచితే.. బీజేపీ నిండా ముంచేందుకు సిద్ధమవుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. ఇప్పుడున్న బీజేపీ సర్కార్ సింగరేణిని ప్రయివేటు పరం చేస్తాం అంటున్నారు. ఎంత ఘోరం అంటే.. గోల్ మాల్ చేస్తున్నారు అని కేసీఆర్ నిప్పులు చెరిగారు. దేశంలో బొగ్గుకు కొరత లేదు అని కేసీఆర్ స్పష్టం చేశారు. 361 బిలియన్ టన్నుల బొగ్గు ప్రజలకు అందుబాటులో ఉంది. కానీ ఈ దేశంలో ఏ జరుగుతుంది. 361 బలియన్ టన్నుల బొగ్గు నిల్వలు దేశంలో ఉన్నాక బొగ్గు గనులను, కరెంట్‌ను ప్రయివేటు పరం చేస్తాం అని బీజేపీ నాయకులు అంటున్నారు. కరెంటు ఉద్యోగాలు పీకేస్తాం అంటారు. సింగరేణిని ప్రయివేటు వాళ్లకు అప్పజెప్తామని అంటారు. ఏం పాలసీ ఇది.. ఏం దిక్కుమాలిన పాలసీ ఇది. ఏం జరుగుతుంది ఈ దేశంలో అని కేసీఆర్ మండిపడ్డారు.

**సింగరేణిని ఒక ఉద్యోగ వనరుగా మార్చబోతున్నాం..**

సింగరేణి బిడ్డలకు ఒక్కటే మాట విన్నవిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో దండిగా ఖనిజ నిల్వలు ఉన్నాయి. సింగరేణి ఒక వజ్రపు తునక లాంటి మైనింగ్‌లో బాగా కౌసల్యం సంపాదించిన సంస్థ. కాబట్టి తెలంగాణలోని మిగతా గనుల తవ్వకాలను సింగరేణికే అప్పగించాలని నిర్ణయం తీసుకున్నాం. సింగరేణిని మరింత విస్తృతపరిచి ఒక ఉద్యోగ వనరుగా మార్చబోతున్నాం అని కేసీఆర్ తెలిపారు.

### బొగ్గు దిగుమతులు ఎందుకు..?

దేశంలో 150 సంవత్సరాల వరకు సరిపడ బొగ్గు ఉన్నా, దాని వాడకుండా ఆస్ట్రేలియా నుంచి ,ఇండోనేషియా నుంచి ఎందుకు దిగుమతి చేస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా అన్యాయం జరుగుతుంది. దాన్ని ఎదుర్కోవడానికే మన పార్టీ బీఆర్ఎస్‌గా మారింది. దేశ వ్యాప్తంగా పోరాటానిక నడుం కట్టి ముందుకు పోతున్నాం. సింగరేణిని కాంగ్రెస్ సగం ముంచితే.. బీజేపీ నిండా ముంచేందుకు సిద్ధమవుతుంది. మోదీ మనల్ని మోసం చేశారు. సింగరేణిని మోసం చేస్తున్నారు. బొగ్గు నిల్వల గురించి ప్రజలకు తెలియాలి అని కేసీఆర్ తెలిపారు.

### మన దగ్గర పవర్ కట్స్ లేవు..

తెలంగాణలో 24 గంటల కరెంట్ ఇచ్చుకుటున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఇలా కరెంట్ ఇవ్వడం లేదు. దేశ రాజధాని ఢిల్లీలో అక్కడ కూడా పవర్ కట్స్ ఉన్నాయి. కానీ మన దగ్గర పవర్ కట్స్ లేవు. దేశంలో ఉన్న బొగ్గు నిల్వలతోని తెలంగాణలో ఇస్తున్న మాదిరిగానే దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి పట్టణానికి, పరిశ్రమలకు, సాగునీటి ప్రాజెక్టులకు 150 సంవత్సరాల వరకు కరెంట్ ఇచ్చేంత బొగ్గు నిల్వలు ఉన్నాయి. దుర్మార్గంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ప్రజలపై భారం మోపుతున్నారు. దీన్ని పసిగట్టి జాగ్రత్తగా వ్యవహరించలి. ముందు ముందు మనం పోరాటం చేయాల్సిన అవసరం ఉంటది అని కేసీఆర్ తెలిపారు.

# అధికారంలోకి వచ్చాక ధరణిని బరాబర్ రద్దు చేస్తాం

మొదటి పేజీ తరువాయి



ఆదానీ, ప్రధాని అని ఎద్దేవా చేశారు. దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజన్ పని అని స్పష్టం చేశారు. వన్ నేషన్ వన్ పార్టీ అనేది బీజేపీ రహస్య ఎజెండా అని వెల్లడించారు. బీజేపీ కుట్రలను ఛేదించి దేశంలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలన్నారు. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయని కార్యకర్తలంతా క్రియాశీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం అందరం సమిష్టిగా కష్టపడదామని పిలుపునిచ్చారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పై చేసే పోరాటంలో గెలవాలంటే యువత ముందుండాలని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించాలని రేవంత్ రెడ్డి అన్నారు.

**ధరణిని బరాబర్ రద్దు చేస్తాం**

గడీల పాలన పునరుద్ధరించడానికే కేసీఆర్ ధరణి తీసుకొచ్చారని రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బినామీల పేరిట సీఎం కేసీఆర్ వేల ఎకరాలను కొట్టేశారని రేవంత్ ఆరోపించారు. “కొద్ది మంది భూస్వాముల కోసమే ధరణి తెచ్చారు. ధరణి పోర్టల్ ను పూర్తిగా ఎత్తివేస్తాం. 97 శాతం భూవివాదాలకు ధరణ పోర్టలే కారణం. మాట ఇచ్చిన ప్రకారం ధరణిని బరాబర్ రద్దు చేస్తాం. రంగారెడ్డి, సంగారెడ్డి, మల్కాజ్ గిరి జిల్లాల్లో భూ అవకతవకలు జరిగాయి. వేల ఎకరాలు కేసీఆర్ బినామీలకు కట్టబెట్టారు. అవకతవకలకు పాల్పడ్డ అధికారులను ఊచలు లెక్కబెట్టిస్తాం” అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ అధికారుల దగ్గర ఉండాల్సిన సమాచారం దళారుల చేతికి వెళ్లిందన్నారు. ధరణి పోర్టల్ ప్రభుత్వ ఆధీనంలో లేదు. ధరణి రాకముందు రైతు బంధు రాలేదా? ధరణి పోర్టల్ ప్రారంభించిన ఊరిలో భూముల రికార్డు లేదు అని ఎద్దేవా చేశారు. ధరణిని రద్దు చేస్తామంటే కేసీఆర్ కు ఎందుకంత దుఃఖం వస్తుంది అని ప్రశ్నించారు. “ధరణి పోర్టల్ ను కేసీఆర్ దోపిడీకి వాడుకున్నారు. ఖచ్చితంగా ధరణి పోర్టల్ రద్దు చేస్తాం. ఏడ్చి, గోల పెట్టినా... తండ్రి కొడుకులను జైలుకు పంపిస్తాం. ధరణి అవకతవకలపై కేసీఆర్ కుటుంబం చర్లపల్లి జైలుకెళ్లడం ఖాయం” అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రి కేటీఆర్ చేసిన సవాల్‌ను స్వీకరించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. 2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధి, 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ‘ 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం. 2014 తర్వాత జరిగిన అభివృద్ధిపై కేటీఆర్, హరీశ్ చర్చకు సిద్ధమా?’ అని రేవంత్ అన్నారు. “కాంగ్రెస్ చేయనిది ఏదైనా మీరు చేసి ఉంటే మేం క్షమాపణ చెప్పడానికి సిద్ధం..తండ్రి కొడుకులు నిప్పు తొక్కిన కోతిలా ఎగురుతున్నరు. కాంగ్రెస్ వస్తే ఏం చేస్తుందని అడుగుతున్నారు. కేసీఆర్ లా మేం రాష్ట్రాన్ని కొల్లగొట్టం.. దోపిడీలు చేయం..కేసీఆర్ కు బుద్ధి జ్ఞానం ఉంటే ఉద్యమకారులను పువ్వుల్లో పెట్టి చూసుకునే వారు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, సచివాలయ నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడ్డారు. కేసీఆర్ నిజంగా తెలంగాణ బిడ్డ అయితే రేవంత్ రెడ్డి పేరు తీయాలి. నా పేరు పలికేందుకు కేసీఆర్ కు భయం” అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అడ్డుకోవడానికే కేసీఆర్ చిల్లర మల్లర వేషాలు వేస్తున్నారు. ప్రజలు ఎవరిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తారో త్వరలోనే తెలుస్తుందన్నారు. కేసీఆర్ రద్దైన వెయ్యి నోటులాంటివాడు మోదీ 2వేల నోటు లాంటి వాడు అని ఎద్దేవా చేశాడు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కు ఒక్క అవకాశం ఇవ్వండి, ఈ దొంగల పాలన నుంచి విముక్తి కల్పిస్తామని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు మంచిరోజులు రాబోతున్నాయి. కర్ణాటక ఫలితాలు తెలంగాణలో పునరావృతం అవుతాయి అని రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ యాడుంది?

మొదటి పేజీ తరువాయి



సూది దబ్బడం పార్టీలని అవమానించిన కేసీఆర్ పంచనే చేరిన సిగ్గు, శరంలేని పార్టీల నేతలు కమ్యూనిస్టులు'' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పెరుగుతున్న బీజేపీ గ్రాఫ్ ను తగ్గించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతోపాటు ఓ సెక్షన్ మీడియా కుట్ర చేస్తోందన్నారు. ఎవరెంత దుష్ప్రచారం చేసినా పట్టించుకోవద్దని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ సింహంలాంటి పార్టీ అని, తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేసి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బండి సంజయ్ అధ్యక్షతన ఖమ్మం పట్టణంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాలులో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, జిల్లాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు.

సర్దార్ పటేల్ గ్రౌండ్ కు అభినవ సర్దార్ పటేల్ రాబోతున్నడు. ఖమ్మంలో బీజేపీ సత్తా ఏందో ''నిరుద్యోగ మార్చ్'' ద్వారా చూపించాం. రేపు అమిత్ షా సభను సక్సెస్ చేసి మరోసారి దమ్ము చూపిద్దాం. కమ్యూనిస్టు పార్టీలు కాలగర్భంలో కలిసిపోయారు. ఆ పార్టీలను సూది దబ్బడం పార్టీలని అవమానించిన కేసీఆర్ పంచనే కమ్యూనిస్టులు చేరారంటే వాళ్లకు సిగ్గు శరం లేదని అర్థమైతోంది. తెలంగాణలో అసలు కాంగ్రెస్ పార్టీ యాడుంది? కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా దేశంలో ఎక్కడా ఆ పార్టీ లేదు.. జాకీ పెట్టి లేపినా కాంగ్రెస్ పార్టీ లేవదు.. అన్ని ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు.. ఏదీ చేతగాని నపుంసకుడు పెళ్లి చేసుకుంటే ఏమైతది. కాంగ్రెస్ పరిస్థితి కూడా అట్లనే ఉంది. బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, ఓ సెక్షన్ మీడియా బీజేపీ గ్రాఫ్ ను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నయ్. కర్నాటక ఫలితాలను బూచీగా చూపి బీజేపీ పనైపోయిందని దుష్ప్రచారం చేస్తోంది. బీజేపీ కార్యకర్తలెవరూ పట్టించుకోవద్దు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమే. ఖమ్మంలో నిరుద్యోగ మార్చ్ సక్సెస్ తో కేసీఆర్ కళ్లు బైర్లు కమ్మినయ్. మళ్లీ 15న అమిత్ షా వస్తున్నారని తెలుసుకుని కేసీఆర్ కు చెమటలు పడుతున్నయ్. ఇక్కడ అమిత్ షా సభ సక్సెస్ అయిన తరువాత అవసరమైతే ప్రధాని మోదీగారి సభను కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తాం. అందుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి. ఖమ్మం జిల్లాలో కూడా 70 శాతం పోలింగ్ బూత్ కమిటీలను పూర్తి చేశాం. తెలంగాణలో రాబోయేది కాషాయ రాజ్యమే. గడీల రాజ్యాన్ని తరిమితరిమి కొట్టడానికి ఇంకా 5 నెలలే టైముంది. గతంలో బీజేపీని ఉరికించి కొడతామన్న నేతలకు మన సత్తా తెలిసి నోరు మూసుకున్నరు. ఎక్కడ చూసినా జనం బీజేపీ పేరే ఉచ్చరిస్తున్నరు. ఆ పార్టీ జోలికి పోతే ప్రజలే తిరగబడతారనే భయం బీఆర్ఎస్ నాయకులకు పట్టుకుంది. కొట్లాట గురించి మాట్లాడే బీఆర్ఎస్ నేతలు ఈ జిల్లాలో ఎంతమందికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చారో సమాధానం చెప్పాలి. ఈ జిల్లా బీఆర్ఎస్ నేతలకు దమ్ముంటే కేసీఆర్ పై ఒత్తిడి తెచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయించాలి. ఈ జిల్లాలో బీఆర్ఎస్ నేతల అరాచకాలకు అంతులేదు. బీఆర్ఎస్ బాధితుల సంఘం సమావేశం పెడితే.. సర్దార్ పటేల్ స్టేడియం కూడా సరిపోదు. ఖమ్మం జిల్లాలో నేతల ఆగడాలకు బలైపోయిన సాయి గణేష్ త్యాగాలను వృథా పోనీయ్యం. తప్పకుండా బీఆర్ఎస్ సంగతి చూస్తాం. అందులో భాగంగా ఈనెల 15న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలి. మహాజన్ సంపర్క్ అభియాన్ పేరుతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనా ఫలితాలపై ఇంటింటికీ తీసుకెళ్లాలి. తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటివరకు అన్ని పార్టీలకు అవకాశమిచ్చిన ప్రజలు ఈసారి బీజేపీకి అధికారమిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. సీఎంసహా మంత్రులు జిల్లాల్లో పర్యటించాలంటే బీజేపీ కార్యకర్తలను చూసి భయపడే పరిస్థితి ఏర్పడింది. అందుకే ముందస్తుగా అరెస్ట్ లు చేస్తున్నారు. పోడు భూములు, 317 జీవో, రైతు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటాలు చేసి జైలుకు వెళ్లిన పార్టీ బీజేపీ. బీఆర్ఎస్ నేతల ఆగడాలు ప్రజలు భరించలేక పోతున్నారు. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదు. సీఎం ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చి ఇచ్చిన హామీలొక్కటీ అమలు కాలే. భద్రాచలం రామాలయం అభివృద్ధికి కేసీఆర్ ఇస్తామన్న 100 కోట్లు నిధులు ఇవ్వలేదు. వరదలప్పుడు కరకట్ట నిర్మాణానికి 1000 కోట్లు ఇస్తాన్న హామీ అమలు కాలేదు. నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం జరగలేదు. కరసేవకుల త్యాగాలు వృధా కాకూడదని రామజన్మ భూమి నిర్మిస్తున్న ఘనత ప్రధాని మోదీదైతే... భద్రాచలం సీతారాముడి కళ్యాణానికి తలంబ్రాలు కూడా తీసుకెళ్లని చరిత్ర కేసీఆర్ ది. ఎవరు నిజమైన రామభక్తులో చెప్పాలి. నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ తెలంగాణలో సింగిల్ గా పోటీ చేస్తాం. గెలిచి సింగిల్ గానే అధికారాన్ని కైవసం చేసుకుంటాం. మీడియాలో బ్రేకింగుల పేరిట జరుగుతున్న షేకింగులను పట్టించుకోవద్దు. అందరూ కష్టపడి ఇష్టపడి పనిచేసి కాషాయ రాజ్య స్థాపనకు క్రుషి చేయాలి. అందులో భాగంగా 15న జరిగే సభను విజయవంతం చేయాలి. ఖమ్మంలో బీజేపీ ఎక్కడిది? సభ సక్సెస్ అయితదా? అని చాలామంది అంటున్నారు. ఇది మీకు అవమానకరం. మీ దమ్మేందో చూపించే రోజు రాబోతోంది. ఎవడన్నా బీజేపీ ఖమ్మంలో లేదని చెబుతోంది. నిరుద్యోగ మార్చ్ తో మా సత్తా చూపాం. తెలంగాణ ప్రజల గుండెల్లో బీజేపీ ఉంది" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశానికి బండి సంజయ్ తోపాటు పార్టీ తమిళనాడు సహ ఇంఛార్జీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీమంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, ఎం.ధర్మారావు, కొండేటి శ్రీధర్, కుంజా సత్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్ తోపాటు వివిధ జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యానారాయణ, కోనేరు చిన్ని, బొబ్బ భాగ్యారెడ్డి, రామచంద్రారెడ్డి, రావు పద్మ, కంకణాల శ్రీధర్ రెడ్డి, అధికార ప్రతినిధులు రాకేశ్ రెడ్డి, పాల్వాయి రజనీతోపాటు రాష్ట్ర నాయకులు గీతామూర్తి, కొండపల్లి శ్రీధర్ రెడ్డి, కడగంచి రమేశ్, విద్యా సాగర్ రెడ్డి, ఉప్పల శారద తదితరులు హాజరయ్యారు.

# మానుకోట టికెట్ దక్కేదెవరికో?

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఏర్పడితే తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తామని గులాబీ బాస్ ఇచ్చిన హామీ నెరవేరింది. దీంతో అందరూ కారు గుర్తుకే ఓటేశారు. అయితే రానురాను ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపీ కవిత మధ్య వర్గ పోరు క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఒకట్రెండు సందర్భాల్లో ఇరువురు నేతలు తమ తీరుతో బాహటంగానే దీన్ని బయటపెట్టారు. ఒకసారి సభలో ఎంపీ కవిత మాట్లాడుతుండగానే ఎమ్మెల్యే శంకర్ నాయక్ అడ్డుకుని మైక్ లాక్కున్నారు. మరో సభలోనూ ఇలాంటి సీన్ రిపీటైంది. ఇదిలా ఉండగా శంకర్ నాయక్ పైనా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈసారి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్న కేసీఆర్ కు పలువురు ఎమ్మెల్యేల తీరు ఇబ్బందికరంగా మారింది. అందుకే పలువురు అభ్యర్థులను మారుస్తారని ప్రచారం జరుగుతోంది. మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో కొంతకాలంగా ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపీ మాలోత్ కవిత మధ్య వర్గపోరు వల్ల నాయకులు, కార్యకర్తలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టాలంటే అభ్యర్థులు మార్పు చేపడితేనే సాధ్యమని రాజకీయ వర్గాలు కోడై కూస్తున్నాయి. అయితే మహబూబాబాద్ టికెట్ ఎవరికిస్తే బాగుంటుందనేది గులాబీ బాస్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

ముఖ్యమంత్రి ఆశీస్సులు ఉన్న నేతకే ఆ సీటు దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. ఇక మంత్రి సత్యవతి రాథోడ్ కు సౌమ్యురాలిగా పేరుండటం, వివాదాలకు దూరంగా ఉండటం, ఎమ్మెల్యే, ఎంపీలను సమన్వయం చేసుకుని ప్రజల్లోకి వెళ్లడంతో పాటు, పార్టీని బలోపేతం చేస్తుందనే పేరుండటంతో ఆమెకే టికెట్ దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. పోడు భూముల పట్టా, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ల అమలు అంశంలో మంత్రి సత్యవతి రాథోడ్ కీలకంగా వ్యవహరించడంతో ప్రజల ఆదరణ ఆమెకు ఎక్కువగా ఉండే అవకాశముందని ప్రచారంలో ఉంది. ఇటీవల చేపట్టిన సర్వేలోనూ సత్యవతి రాథోడ్ అయితేనే అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని రిపోర్ట్ వెళ్లినట్లు తెలుస్తోంది. గులాబీ బాస్ కూడా క్లీన్ ఇమేజ్ ఉన్న వారికే ఈసారి టికెట్ కేటాయించాలని చూస్తుండటం ఈ ప్రచారానికి మరింత బలాన్ని చేకూర్చనుంది.

# ఖమ్మం ప్రజల భరోసాకు 15న సభ

## సక్సెస్ ద్వారా ఖమ్మంలో బీజేపీ దమ్మేంతో చూపిస్తాం : బండి


## కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు

**ఖమ్మం, విశాల భారతి :** ఈనెల 15న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఖమ్మం వస్తున్న నేపథ్యంలో కనీవినీ ఎరగని రీతిలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ నిర్ణయించారు. అందులో భాగంగా లక్ష మందికి తగ్గకుండా జన సమీకరణ చేసేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి తదితరులతో కలిసి స్థానిక సర్దార్ పటేల్ గ్రౌండ్ తోపాటు ఆ పక్కనే ఉన్న ఎస్ఆర్ అండ్ బీజీఎన్నార్ మైదానాలను పరిశీలించారు. తొలుత పటేల్ గ్రౌండ్ లో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పినప్పటికీ ఆ తరువాత బీజీఎన్నార్ మైదానం పరిశీలించాక ఆ మైదానంలోనే సభ నిర్వహించేందుకు మొగ్గు చూపారు. అమిత్ షా మొదటిసారి ఖమ్మం వస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున జనం తరలివచ్చే అవకాశం ఉందని భావిస్తున్న బండి సంజయ్ కుమార్ సువిశాలమైన ఎస్ఆర్ అండ్ బీజీఎన్నార్ మైదానంలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా మైదానాల పరిశీలన సందర్భంగా అక్కడే పిల్లలతో కలిసి కాసేపు ఫుట్ బాల్ ఆడారు. అనంతరం నడుచుకుంటూ రోడ్డు వద్దకు వచ్చి స్థానిక సునీల్ కేఫ్ లో కార్యకర్తలతో కలిసి ఛాయ్ తాగారు. ఈ సందర్భగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.... ఈనెల 15న సాయంత్రం 4 గంటలకు ఖమ్మం డిగ్రీ కాలేజీ స్టేడియంలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించబోతున్నాం. సభ ఏర్పాట్లను పరిశీలించడానికే ఇక్కడికి వచ్చాం. అన్నింటికీ అనుకూలమైన మైదానం. ఎట్టి పరిస్థితుల్లోనూ లక్షకు తగ్గకుండా జన సమీకరణ చేస్తాం. ఖమ్మంలో బీజేపీ సత్తా, దమ్ము చూపడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నాం. ఈరోజు జరిగిన సన్నాహక సమావేశంలో కార్యకర్తల జోష్ చూస్తే లక్ష మందిని మించి సభకు హాజరయ్యే అవకాశముంది. ఖమ్మం ప్రజలు బీజేపీని ఆశీర్వదించాలని కోరుతున్నా. దేశం కోసం, దేశ రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా జిల్లాకు వస్తున్న నేపథ్యంలో స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలపాలని కోరుతున్నా. బీజేపీ కార్యకర్తలంతా పోలింగ్ బూత్ ల వారీగా ప్రచారం చేయాలి. సభకు తీసుకురావాలి. జన సమీకరణపై రాష్ట్ర సీనియర్ నాయకులతో ఓ కమిటీని వేయబోతున్నాం. నిరుద్యోగ మార్చ్ ఏ విధంగా సక్సెస్ అయ్యిందో మీరంతా చూశారు. అమిత్ షా బహిరంగ సభను ఇతర జిల్లాల్లో నిర్వహించాలని ఒత్తిడి వస్తున్నప్పటికీ కష్టాల్లో ఉన్న ఖమ్మం ప్రజలకు ఆత్మవిశ్వాసం కలిగించడానికి, బీజేపీ దమ్మేందో చూపడానికే ఇక్కడ సభ నిర్వహించాలని నిర్ణయించాం. కార్యకర్తలు, యువత ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరుతున్నా.

# వారంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి

## త్వరలోనే సీఎం కేసీఆర్ తో గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభం

## హుస్నాబాద్ గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే సతీశ్ తో కలిసి పనులు పరిశీలించిన రాష్ట్ర మంత్రి హరీశ్



**హుస్నాబాద్ - విశాల భారతి:** హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల దశాబ్దాల సాగునీటి కల త్వరలోనే సాకారం కానున్నదని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. త్వరలోనే సీఎం కేసీఆర్ తో గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ నియోజక వర్గంలోని 8.23 టీఎంసీల గౌరవెల్లి ప్రాజెక్ట్ ను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే సతీష్ తో కలిసి మంత్రి పరిశీలించారు. అక్కడికక్కడే ఇరిగేషన్ ఇంజనీర్లతో సుమీక్షించి మిగులు పనులు వారంలోపే పూర్తయ్యేలా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే భూ నిర్వాసితులకు పరిహారం అందించే ప్రక్రియ పూర్తయ్యిందని, అలాగే 8 కిలోమీటర్ల మేర కట్ట నిర్మాణం పూర్త పూర్తయిందని తెలిపారు. సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును ఒక సదుద్దేశంతో మొదలు పెట్టారని, ఈ ప్రాజెక్టును మరో వారం రోజులలో పూర్తి కానున్నదని, ఫలితంగా గోదావరి జలాలతో హుస్నాబాద్ నియోజకవర్గం సస్యశ్యామలం కాబోతోందని తెలిపారు.

# అయ్యగారే హంతకుడు

**మొదటి పేజీ తరువాయి**

ఇంటి లోనే అప్సర నివాసం ఉంటోంది. తరచూ గుడికి వచ్చే క్రమం లో అప్సర తో సాయికృష్ణ కు పరిచయం ఏర్పడింది. శంషాబాద్ గోశాల కు ఇద్దరూ కలిసే వెళ్లేవారు. ఈ పరిచయం వివాహేతర సంబంధాని కి దారితీసింది. ఈ క్రమం లో అప్సర గర్భం కూడా దాల్చింది. నిందితుడు పూజారి సాయికృష్ణ కే ఇదివర కే వివాహం అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయినా అప్సర.. అతడి ని ఇష్టపడింది. అయితే అప్సర ఇతరుల తోనూ చనువు గా ఉండడం కడుపు కూడా ఆమెకు ఇతరుల వల్లే వచ్చిందని నమ్మడం తనను పెళ్లి చేసుకోవాల ని ఒత్తిడి చేస్తుండటం తోనే సాయి కృష్ణ ఆమె ను అంతమొందించాలని నిర్ణయించాడు. ఈ నేపథ్యంలో జూన్ 3న తాను కోయంబత్తూరు వెళ్తు న్నానని సాయికృష్ణ తన ను డ్రాప్ చేస్తాడని తల్లి కి చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది అప్సర. సాయికృష్ణ అప్సర ఇద్దరూ కలిసి ఫోర్డ్ కారు లో శంషాబాద్ రాళ్లగూడ వైపు వెళ్లారు. అక్కడ భోజనం చేశారు. ఆ తర్వాత కారు లో ఫ్రంట్ సీట్ లో అప్సర నిద్ర లోకి జారుకుంది. ఇదే అదను గా ఆమె ను హత్య చేయడం కోసం తెచ్చిన బెల్లం దంచే దుడ్డుకర్ర తో అప్సర తలపై బాది చంపేశాడు. ఆపై కవర్ లో ఆమె డెడ్ బాడీ ని ఉంచి ఇంటి కి తీసుకొచ్చాడు. ఆ కారు ను రోజంతా ఇంటి ముందే పార్క్ చేశాడు. ఆ మరుసటి రోజు సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయం వెనుక మ్యాన్హోల్ లో అప్సర మృతదేహాన్ని పడేసి.. పైన మట్టి కప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత తన కు ఏమీ తెలియదన్నట్టు ఈ నెల 5వ తేదీన తన అక్క కూతురు కనిపించకుండా పోయిందని సాయికృష్ణ పోలీసుల ను ఆశ్ర యించాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే.. సాంకేతిక ఆధారాలు సీసీ కెమెరాల పుటే జీ ఆధారంగా సాయికృష్ణే హంతకుడ ని పోలీసులు తేల్చారు. సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయ సమీపం లోని మ్యాన్ హోల్ లో నుండి అప్సర మృతదేహాన్ని పోలీసులు తాజాగా వెలికి తీశారు. డెడ్ బాడీ ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రి కి తరలించారు. కాగా అప్సర రెండోసారి గర్భం దాల్చిందని.. ఈ విషయం లోనే ఇద్దరి మధ్య గొడవ జరిగిందని భా విస్తున్నారు. అయితే ఈ గర్భానికి తాను కారణం కాదని.. ఇతరుల తో చనువుగా ఉండటం వల్లే గర్భం దాల్చి ఉంటుందని సాయికృష్ణ అనుమానించాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అంతే కాకుండా పెళ్లి చేసుకోవాల ని ఒత్తిడి చేస్తుండటంతో ఆమె ను హత్య చేశాడని భావిస్తున్నారు. పోస్ట్మార్టం రిపోర్ట్ వస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయని చెబుతున్నారు. కాగా సాయికృష్ణ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# 53 మంది పోలీసు అధికారులకు పదోన్నతి



**హైదరాబాద్-విశాలభారతి:** రాష్ట్ర వ్యాప్తంగా 53 మంది పోలీసు అధికారులకు తెలంగాణ ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. అదనపు ఎస్పీలుగా విధులు చేపడుతున్న 18 మందికి ఎస్పీలుగా, మరో 35 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన అధికారులు డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలన్నారు. 15 రోజుల్లోగా నూతన విధుల్లో చేరాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# శరద్ పవార్ ను చంపుతాం





- బెదిరింపు మెసేజ్ కలకలం
- ముంబై పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు
- ఎంపీ సంజయ్ రౌత్, సునీల్ రౌత్‌కు కూడా కాల్స్

**ముంబై - విశాల భారతి:** మరాఠా దిగ్గజ నాయకుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ ను చంపుతామంటూ బెదిరింపులు వచ్చాయి. వాట్సాప్‌లో తనకు ఈ మెసేజ్ వచ్చినట్టు శరద్ పవార్ కుమార్తె, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే చెప్పారు. ఆ విషయమై సుప్రియ, పలువురు ఎన్సీపీ నేతలు ముంబై పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అగంతకులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సుప్రియా సూలే మీడియాతో ఈ విషయం వివరిస్తూ, పవార్‌ను బెదరిస్తూ వాట్సాప్‌లో తనకు మెసేజ్ వచ్చిందని, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చానని చెప్పారు. ఈ విషయంలో మహారాష్ట్ర హోం మంత్రి, కేంద్ర హోం మంత్రి సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి నీచ రాజకీయాలను వెంటనే ఆపాలని ఆమె డిమాండ్ చేశారు.

**సంజయ్ రైత్, సునీల్ రౌత్‌కు కూడా...**

కాగా, ఉద్ధవ్ థాకరే వర్గం ఎంపీ సంజయ్ రౌత్, ఆయన సోదరుడు సునీల్ రౌత్‌కు కూడా గురువారం బెదిరింపు ఫోన్లు వచ్చాయి. మీడియా ముందు మాట్లాడవద్దంటూ తమకు బెదిరింపు కాల్స్ వచ్చినట్టు ఉద్ధవ్ థాక్రే వర్గం ఎమ్మెల్యే సునీల్ రౌత్ తెలిపారు. దీనిపై ముంబై పోలీస్ కమిషనర్, రాష్ట్ర హోం మంత్రికి ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు.

# రంగంలోకి దళారులు

- పల్లెల్లో ఎన్నికలను మురిపించే విధంగా ప్రచారం..
- విద్యార్థుల కోసం ప్రైవేట్ సంస్థల వేట..
- అది చేస్తాం ఇది చేస్తామని ప్రలోభాలు
- తల్లిదండ్రులను బుకాయిస్తున్న బ్రోకర్లు
- లేని సౌకర్యాలు ఉన్నట్లు అబూతకల్పన..



**జఫర్ గడ్- విశాల భారతి :** గత నెల రోజులుగా ప్రైవేట్ పాఠశాల, కాలేజీల యాజమాన్యాలు ప్రచారంలో హోరెత్తిస్తున్నాయి.వాటికి సంబంధించిన మీడియేటర్లు, బ్రోకర్లు గ్రామాలలో విద్యార్థుల కోసం జల్లెడ పడుతున్నారు.తల్లిదండ్రులను ఊహాలోకంలో విహరింప చేస్తూ గాలం వేస్తున్నారు. పరీక్షలు పూర్తి కాకముందే వివిధ కాలేజీల యాజమాన్యాలు దళారులను రంగంలోకి దించారు. సకల సౌకర్యాలు ఉన్నాయని నాణ్యమైన విద్యను అందిస్తామని నమ్మబలుకుతూ పల్లెల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికలను మురిపించే విధంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు మాయమాటలతో గాలం వేస్తున్నారు. మాటలతో మోసం చేసే యత్నాలు ఇప్పటి నుంచే ప్రారంభించారు.విద్యాసంస్థల్లో ఉండాల్సిన వాతావరణం లేని వాణిజ్య సముదాయాల్లో కాలేజీలను పాఠశాలలను నిర్వహిస్తూ రణగోన చప్పుళ్ల మధ్యన రహదారులకు అనుకొని ఇలాంటి విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు.విద్యార్థులకు గాలి వెలుతురు లేని గదుల మధ్యన తరగతులను నిర్వహిస్తూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థుల కోసం దళారులు గ్రామాలలో తిరిగి వారి తల్లిదండ్రులను మెప్పించి కళాశాలలకు అప్పగించిన తర్వాత చేర్పించిన వారు మళ్ళీ అక్కడ కనపడిన దాఖలాలు లేవు.ఈ విధంగా యజమాన్యాలు విద్యార్థులను మోసం చేస్తున్నాయి.యాజమాన్యాలు ఇచ్చే కమిషన్లకు ఆశపడి దళారులు నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు గాలం వేస్తున్నారు.ఈ విధంగా కళాశాలలో చేరాక విద్యార్థుల కోర్సు పూర్తి అయ్యే అంతవరకు బలి అవుతున్నారు. అంతే కాకుండా తక్కువ విద్యార్హతలు, అనుభవం లేని అధ్యాపకులతో విద్యను అందిస్తూ విద్యార్థుల జ్ఞానాన్ని తగ్గిస్తూ వారి భవిష్యత్తుపై దెబ్బతీస్తున్నారు.దీంతో విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించలేక పోతున్నారు..ఇలాంటి విద్యా వ్యాపారులకు అండదండలు అందిస్తున్న రాజకీయ అధికార వర్గానికి కూడా భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తుంది. కొందరు రాజకీయ నాయకులు రాజకీయ నిరుద్యోగులు విద్యను ఒక వ్యాపారంగా మార్చి విద్యార్థులు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఈ వ్యాపారంలో స్వచ్ఛందంగా పరోక్షంగా పాలు పంచుకుంటున్నారు..

**విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమా...!**

విద్యా వ్యాపారంతో లక్షలు గడిస్తున్నారు.ఉన్నత అధికారులతో సత్సంబంధాలు ఏర్పరచుకొని ప్రైవేటు పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేస్తూ ఒక వ్యాపారంగా మార్చు కుంటున్నారు.జనగామ జిల్లాలోని అన్ని మండలాల్లో గత కొంత కాలంగా ఈ విద్యా వ్యాపారం జోరుగా సాగుతోంది.అధికారులకు తెలిసిన కూడా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విద్యాశాఖ అధికారులే ఈ దందాను వెనుక నుంచి నడిపిస్తున్నారానే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..ఇప్పటికైనా ప్రైవేట్ విద్యాసంస్థలపై నిఘా పెట్టాలని అక్రమాలకు పాల్పడుతున్న వారి పై ఉన్నతధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు, పలు విద్యా సంస్థలు డిమాండ్ చేస్తున్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

### రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్



**పటాన్ చెరు-విశాలభారతి:** డివిజన్ పరిధి లోని అన్ని కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు రామచంద్రపురం కార్పొరేటర్ బురుగడ్డ పుష్ప నగేష్ అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో 24 లక్షల రూపాయలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయి నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉన్నట్టు బస్తి దర్శన్ కార్యక్రమంలో స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు తెలిపినట్టు, అధికారులతో చర్చించి సుమారు 24.00 లక్షల రూపాయిలు మంజూరు చేయించామని చెప్పారు. డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. పెట్రోల్ బంక్ వెనుకాల డ్రైనేజీ పొంగిపొర్లుతుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో, సుమారు 30 లక్షల డ్రైనేజీ లైన్ మంజూరు అయింది అని త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, జలమండలి డిజిఎం శివకృష్ణ, మేనేజర్ జనార్దన్, రవి కిరణ్ గౌడ్, నారాయణ, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ చారి, మణయ్య, శ్రీనివాస్, కృష్ణ రెడ్డి, మల్లేష్, నాగేశ్వర్, సీఎం మల్లేష్, వెంకటేశ్వర్లు, రాజు, ప్రీతీ గౌడ్, అర్చన తదితరులు పాల్గొన్నారు.



## గడప గడపకు కేసీఆర్

# సంక్షేమ ఫలాలు

### బీసీ కుల వృత్తులకు 'లక్ష' సహాయం చారిత్రాత్మక నిర్ణయం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ○ పటాన్ చెరులో ఘనంగా సంక్షేమ సంబరాలు

**పటాన్ చెరు-, విశాలభారతి :** ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకం ఫలాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 8వ రోజైన శుక్రవారం పటాన్ చెరు మండలం పాటి గ్రామ చౌరస్తాలో గల ప్రైవేటు ఫంక్షన్ హాలులో నియోజకవర్గస్థాయి సంక్షేమ సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, నియోజకవర్గంలోని వివిధ పథకాల లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అన్న ధృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని తెలిపారు. ప్రధానంగా నిరుపేదల ఆడపిల్లల వివాహం భారం కాకూడదన్న ఉద్దేశంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ప్రవేశపెట్టి లక్ష 116 రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ పథకం మూలంగా లక్షలాదిమంది ఆడపిల్లల కుటుంబాలు లబ్ది పొందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. వీటితోపాటు ఒంటరి మహిళలు, వితంతులు, వృద్ధులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, వికలాంగులకు 2000 రూపాయల నుండి 3000 రూపాయల వరకు పెన్షన్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తోందని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా దళితులు ఆర్థిక అభ్యున్నతి కోసం 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ పథకం దళితుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. బీసీ వర్గాలలోని కులవృత్తుల సంక్షేమం కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. బ్యాంకుల లింకేజీ లేకుండా నేరుగా లబ్ధిదారు ఖాతాలోకి జమ చేసి, వారి ఆర్థిక పరిపుష్టికి బాటలు వేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ముగ్గురు లబ్దిదారులకు చెక్కులు అందజేసి బీసీ కుల వృత్తులకు ఆర్థిక సాయం పథకాన్ని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవానందం, సుష్మాశ్రీ వేణుగోపాల్ రెడ్డి, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, సుప్రజా వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్లు రోజా బాల్ రెడ్డి, లలిత సోమిరెడ్డి, కార్పొరేటర్లు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కమిటీల చైర్మన్లు, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.





# అమీన్ పూర్ లో ఘనంగా ఊరూరా చెరువుల పండుగ ఉత్సవాలు

**కోలాటం, బోనాలు, భాజా భజంత్రీలు, పోతరాజుల విన్యాసాలతో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

**హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి**





పటాన్ చెరు, విశాల భారతి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు కట్ట పైన గురువారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరూర చెరువుల పండగ కార్యక్రమం అంబరాన్ని అంటింది. వందలాది మంది ప్రజల సమక్షంలో కోలాటాలు, పోతరాజుల విన్యాసాలు, బోనాలు, బతుకమ్మలు తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పాయి. ఈ కార్యక్రమానికి పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ద చెరువు కట్టపై నిర్వహించిన సంబరాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టాయని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో చెరువులన్నీ జలకలతో కలకలలాడుతున్నాయని తెలిపారు. పెద్ద చెరువు కట్టను ఆధునిక వసతులతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## 'పంట మద్దతు ధర పెంచడం హర్షణీయం'

**విశాల భారతి, ఇబ్రహీంపట్నం:** కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర పెంచడం హర్షణీయమని ఇబ్రహీంపట్నం బీజేపీ ఇన్‌చార్జ్ కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూరు చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నేతలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో 9ఏళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఇప్పటివరకు మద్దతు ధర పెంచకపోవడం శోచనీయమన్నారు. రైతు ప్రభుత్వమంటూ... రైతులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయకపోవడం దురదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆదిభట్ల ఫ్లోర్ లీడర్ పొట్టి రాములు, శిగ వీరస్వామిగౌడ్, నారాయణయాదవ్, యాదగిరిరెడ్డి, లక్ష్మిపతిగౌడ్, సతీష్‌గౌడ్, రుద్ర శంకర్, గణేష్‌గౌడ్, వినయ్‌కుమార్, శ్రీదేవి, రావుల మహేష్, నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, అచ్చమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

## 'హైకోర్టు ఆదేశాలు అమలు చేస్తాం'

**విశాల భారతి, తుర్కయంజాల్:** తుర్కయంజాల్‌లోని మాసాబ్‌చెరువు పరిధిలో ఎలాంటి నిర్మాణాలు జరపొద్దని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తామని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. కలెక్టర్‌కు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు, ఇరిగేషన్ అధికారులకు, అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వోకు, మున్సిపల్ కమిషనర్‌కు మాసాబ్‌చెరువు పరిరక్షణ సమితి నేతలు కోర్టు ఆర్డర్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా కోర్టు ఆర్డర్ ప్రకారం ఇకపై చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో ఎలాంటి కబ్జాలు, మట్టి డంపింగ్, నిర్మాణాలు చేపట్టడకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారని పరిరక్షణ సమితి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు బచ్చిగళ్ల రమేష్, ఉపాధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, రమావత్ కల్యాణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి గుత్తా మహేందర్‌రెడ్డి, కార్యదర్శి వద్దిగళ్ల బాబు, కార్య నిర్వాహక కార్యదర్శి మల్లెల ఉపేందర్, మైలారం బాబు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారు



**యూపీఎస్సీ పరీక్షల్లో ఆల్ ఇండియా 51 ర్యాంకు సాధించిన సైక్లింగ్ అకాడమీ క్రీడాకారుడు మధుసూధన్ రెడ్డిని సన్మానించిన చైర్మన్.. స్పోర్ట్స్ అధికారులు.**

**మధుసూధన్ రెడ్డి విజయం యువతకు స్ఫూర్తి.. శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్..**

**హైదరాబాద్,విశాల భారతి:** క్రీడల్లో రాణించిన వారు ఏ రంగంపైన దృష్టి సారిస్తే, ఆ రంగంలో అద్భుతమైన విజయాలు సాధించవచ్చునని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. సైక్లింగ్ క్రీడాకారుడు అన్నాడి మధుసూదన్ రెడ్డి ఇటీవల యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో ఆల్ ఇండియా 51 ర్యాంక్ సాధించడం, సెంట్రల్ ఆర్మ్డ్ రిజర్వు పోలీస్ విభాగంలో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగాన్ని సాధించిన సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వేలోడ్రమ్ స్టేడియంలో ఆయనకు ఘనంగా సన్మానించి సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ మానసిక శారీరక దృఢత్వం కలిగి ఉండే క్రీడాకారులు ఏ రంగంలోనైనా అద్భుతమైన విజయం సాధించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని దానికి నిదర్శనమే మధుసూదన్ రెడ్డి సాధించిన ఆల్ ఇండియా ర్యాంక్ అని చెప్పారు. సైక్లింగ్ అకాడమీలో విద్యార్థిగా ఉంటూ ఒక ఐపీఎస్ అధికారి సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని క్రీడలతో పాటు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. సివిల్ సర్వీసులో ఆల్ ఇండియా 51 ర్యాంకు సాధించడం రాష్ట్రంలోని వివిధ స్పోర్ట్స్ అకాడమీలు, స్పోర్ట్స్ స్కూళ్లలో ఉన్న విద్యార్థిని విద్యార్థులకే కాకుండా తెలంగాణ గ్రామీణ యువతకు అందరికీ స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా మారుమూల పల్లెలో పుట్టి, క్రీడల్లో రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి, అదే సమయంలో సివిల్స్‌పై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మధుసూదన్ రెడ్డి తెలంగాణ గ్రామీణ క్రీడాకారులకు, యువతకు స్ఫూర్తి కలిగించేలా తన సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ సుధాకర్ రావు, స్టేడియం సిబ్బంది, కోచ్‌లు, సైక్లింగ్ క్రీడాకారులు పలువురు పాల్గొన్నారు.



## 'హజ్ యాత్రకు వెళ్లడం అదృష్టం'

**విశాల బారతి, తుర్కయంజాల్:** ముస్లింలు ఒక్కసారైనా చేయాల్సిన యాత్ర హజ్ యాత్ర అని తుర్కయంజాల్ ముస్లిం మత పెద్దలు తెలిపారు. స్థానిక జామా మసీద్ ఇమామ్ నసీర్ ఉల్ అక్రమ్ ఈనెల 14న హజ్ యాత్రకు బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా నసీర్‌ను పెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లడం ప్రతి ముస్లిం అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యులు మీర్ సుజాత అలీ, ముస్లిం పెద్దలు జూల్కదర్ అలీ, సయ్యద్ సలీం, సయ్యద్ రషీద్, హన్నాన్ ఖురేషి, మన్నన్ ఖురేషి, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు..



## డాక్టర్ కృష్ణకు ఐఎన్ఎస్ఏ విసిటింగ్ ఫెలోషిప్

**పటాన్ చెరు-విశాలభారతి:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణ కుమ్మరి భారత జాతీయ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) విసిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ విభాగాధిపతి డాక్టర్ మోతహార్ రెజా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఐఎన్ఎస్ఏ మార్గదర్శకాల ప్రకారం, ఫెలోషిప్ అనేది అధునాతన పరిశోధనలు, లేదా భారతీయ పరిశోధనా సంస్థలు/ప్రయోగశాలలో ప్రత్యేక శిక్షణ పొందడం కోసం ఉద్దేశించినదన్నారు. ఈ అవార్డు పొందిన వ్యక్తి మనదేశంలోని ఏదేని ప్రయోగశాల లేదా పరిశోధనా సంస్థలో కనీసం ఒక నెల నుంచి గరిష్టంగా ఆరు నెలల వరకు గడపవలసి ఉంటుందని తెలిపారు. అవార్డు గ్రహీతలకు ప్రయాణ ఖర్చులతో పాటు నెలకు 30 వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తారన్నారు. ఐఎన్ఎస్ఏ విసిటింగ్ ఫెలోషిప్ పొందిన డాక్టర్ కృష్ణను సహ అధ్యాపకులు పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన

**శేరిలింగంపల్లి-, విశాలభారతి:** మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సంస్కృతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తరంగిణి మ్యూజిక్ అండ్ డాన్స్ అకడెమి పద్మజ విశ్వాస్ శిష్య బృందం కర్ణాటక గాత్రం, కీబోర్డ్, , కూచిపూడి నృత్యం, గిటార్ అంశాలలో ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా రుత్విక, చారని, కృతిక , అనికేత్, కామాక్షి లు కర్ణాటక గాత్రంలో అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు.కార్తికేయ, అక్షయ, రేవంత్, శ్రీహస్ లు కీబోర్డ్ పై హర హర శంభో, గరుడగమనా, కాలభైరవాష్టకం,కీబోర్డ్ పై వాయించారు.దర్శ, అనురాగ్, దీక్షానంద్ లు గిటార్ పై అయిగిరినందిని అంశాలను ప్రదర్శించారు. చారని, వర్ణిక, గీతికా, భావిక, శ్రీన, తనుష్క మొదలైన వారు కూచిపూడి నృత్యం లో మూషిక వాహన, గరుడగమనా, గణేశా పంచరత్న, కంచదలయాదాక్షి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బెల్లం మాధవి విచ్చేసి కళాకారులను అభినందనలు తెలిపి ప్రోత్సహించారు.

## నిబంధనలు పాటించని కార్పొరేట్ ,ప్రైవేటు స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలి

**పి.డి.ఎస్.యూ డిమాండ్.**

**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి:** నిజామాబాద్ నగరంలో అనుమతి లేని కనీస నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలోపి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ అనుమతులు లేని కనీస నిబంధనలను పాటించకుండా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే అడ్మిషన్స్ తీసుకుంటు న్నారని,పేరెంట్స్ కమిటీల అనుమతి లేకుండానే స్కూల్ ఫీజులు విపరీతంగా పెంచారని,డొనేషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, నిజామాబాద్ లో చాలా విద్యాసంస్థలలో ఫైర్ సేఫ్టీ , ఆట స్థలాలు లేవని.202324 అకడమిక్ ఇయర్ లో రెన్యూవల్ కానీ ప్రైవేట్ విద్యాసంస్థలు చాలా ఉన్నాయని,విద్యా సంస్థలలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని లేనిచో పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో ఆందోనలు చేస్తామని విద్యాశాఖ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు,మనోజ్,విజయ్,రంజిత్ ,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పన ధ్యేయం



### ప్రభుత్వ విప్ గాంధీ

**శేరిలింగంపల్లి-, విశాలభారతి :** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్ కాలనీ లో రూ.40.00 లక్షల రూపాయల అంచనావ్యయం తో చేపడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను జిహెచ్ఎంసి ,ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ .ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టు కొని వరద నీటి కాల్వ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని ప్రభుత్వ విప్ గాంధీ అధికారులకు తెలియచేశారు.ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తిరునని పనులలో వేగం పెంచాలని ప్రతి కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని,సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి కెసిఆర్ మార్గదర్శకం లో గౌరవ మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని,వరద నీటి కాల్వ నిర్మాణం వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, పార్క్ లను అన్ని రకాల మౌలిక వసతుల తో, అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో సుందర శోభిత వనాలుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ గాంధీ చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని ప్రభుత్వ విప్ గాంధీ చెప్పడం జరిగినది. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని , నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్ గాంధీ పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎ ఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహాదేవ్ జలమండలి అధికారులు డీజిఎం వెంకటేశ్వర్లు , మేనేజర్ ప్రశాంతి మరియు బీఆర్ ఎస్ పార్టీ నాయకులు పోతుల రాజేందర్,ప్రసాద్, అంజయ్య, కోటిరెడ్డి, శ్రీనివాస్ రావు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు



## 'అభివృద్ధి పనులు ప్రారంభం'

**విశాల భారతి, ఇబ్రహీంపట్నం:** మంచాల మండలాన్ని అభివృద్ధిలో ముందుంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జెడ్పీటీసీ మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి తెలిపారు. మంచాల మండలం కాగజ్‌ఘాట్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శ్మశానవాటిక కాంపౌండ్ వాల్ పనులను నిత్య నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిత్య నిరంజన్‌రెడ్డిని స్థానికులు, ముస్లి మత పెద్దలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అండాలు వెంకటేష్, కోఆప్షన్ సభ్యులు వాజిద్, ఉప సర్పంచ్ ఐలయ్య, వార్డు మెంబర్లు కలిం, వెంకట రాఘవ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ నాగమణి, కో ఆప్షన్ సభ్యులు అంజయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు జంగయ్య, పసుల రవి, అదిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పొద్దుటూరి రవీందర్ రెడ్డి మృతి

- **నాలుగేళ్ల క్రితం హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పదవి విరమణ...**
- **10న హైదరాబాదులో అంత్యక్రియలు...**



**నిజామాబాద్ బ్యూరో-విశాల భారత్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్ మూర్ కు చెందిన హైకోర్టు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పొద్దుటూరి రవీందర్ రెడ్డి (63) చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. నెల రోజులుగా రవీందర్ రెడ్డి చెవి ఇన్ఫెక్షన్కు గురై చికిత్స తీసుకుంటూ ఆ ఇన్ఫెక్షన్ బ్రెయిన్ కు చేరడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి బాగా క్షీణించింది. హైదరాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రిలో ఎం ఐ సి యూ లో అత్యంత క్రిటికల్ పొజిషన్లో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. కాగా పొద్దుటూరి రవీందర్ రెడ్డి అంత్యక్రియలు శనివారం హైదరాబాదులోని ఆయన స్వగృహం అయినా డిసైడ్ ఫామ్ విడోస్, ఎల్జి విస్టాస్ కాలనీ, ప్లాట్ నెంబర్ 43 నుంచి నిర్వహించ నున్నారు. మృతుడికి భార్య పి.సుచరిత రెడ్డి, కుమార్తెలు నిఖితారెడ్డి, లికిత రెడ్డి, అల్లుండ్లు రాజు రెడ్డి, వినయ్ రెడ్డిలు ఉన్నారు. పొద్దుటూరి రవీందర్ రెడ్డి 1992 సంవత్సరంలో జహీరాబాద్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా మొదట విధుల్లో చేరారు. అక్కడి నుంచి సీనియర్ ఏపీపీ గా ఇందూరు జిల్లాలోని బోధన్ కోర్టుకు బదిలీ అయ్యారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ కోర్టుకు ప్రమోషన్ పై అడ్మినిస్ట్రేషన్ పిపిగా రవీందర్ రెడ్డి బదిలీ అయ్యారు. అటు తరువాత అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్ 1, గ్రేట్ 2 గా ప్రమోషన్ పొంది హైదరాబాదులోని నాంపల్లి కోర్టులో పనిచేశారు. నాలుగేళ్ల కిందట 2019 సంవత్సరంలో హైదరాబాదులోని నాంపల్లి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా రిటైర్ అయ్యారు.




## గడపగడపకు సంక్షేమ పథకాలు

**విశాల భారతి, ఇబ్రహీంపట్నం: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తెలంగాణలోని ప్రతి గడపకు చేరడం గర్వకారణమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. తెలంగాణలో హనుమంతుడి గుడి లేని ఊరు లేదు, కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని, ప్రతి ఇంట్లో ఏదో ఒక సంక్షేమ పథకం అందుతుండటం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలు లబ్ధి పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీలు కృపేష్, నర్మదా, జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.**